క్లుప్తంగా

సీఐగా తిమ్మయ్య బాధ్యతల స్వీకరణ



బుచ్చినాయుడుకండ్రిగ: పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తిమ్మయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈనెల 14వ తేదీన సాక్షి దినపత్రికలో 'ఏడు నెలలుగా సీఐ పోస్టు ఖాళీ' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన సంబంధిత శాఖ జిల్లా ఉన్నతాధికారులు సీఐగా తిమ్మయ్యను నియమించారు. గురువారం ఆయన బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ శ్రీహరి ఎన్నికల ప్రక్రియలో వీఆర్‌కు బదిలీ అయ్యారు. దీంతో శ్రీకాళహస్తి రూరల్ సీఐ రారాజు ఏడు నెలలుగా ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. బుచ్చినాయుడుకండ్రిగలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి, ఇసుక అక్రమ రవాణాను, మద్యం బెల్టుషాపులు నియంత్రించి, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చూస్తానని ఆయన తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..

రూరల్ సీఐ రవినాయక్



రవినాయక్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐగా రవినాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన శ్రీకాళహస్తి రూరల్ సీఐగా నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానన్నారు.

కేవైసీ డిజిటలైజేషన్ తప్పనిసరి

నాగలాపురం: కేవైసీ వివరాలను డిజిటలైజేషన్ కోసం తప్పకుండా నమోదు చేసుకోవాలని స్థానిక వ్యవసాయ సంఘం పరిమితి ముఖ్య కార్యనిర్వాహక అధికారి రామచంద్రారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాథమిక వ్యవసాయ సంఘాల ఖాతాల కంప్యూటరీకరణలో భాగంగా సభ్యత్వం గల సభ్యులు తమ కేవైసీ వివరాలను తప్పకుండా నమోదు చేసుకోవాలని తెలిపారు. సంఘంలో సభ్యత్వం తీసుకుని ఇప్పటివరకు ఏవిధమైన లావాదేవీలు జరపని సభ్యులకు సంఘంలో సభ్యునిగా కొనసాగాలంటే రికార్డులను వెంటనే సమర్పించాలని సీఈఓ కోరారు. 15 రోజుల్లోగా కార్యాలయంలో సమర్పించాలని, లేకుంటే సభ్యత్వం రద్దు చేస్తామని తెలిపారు.

రాజులకండ్రిగలో ఫ్యామిలీ డాక్టర్



వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యబృందం

నాగలాపురం: మండలంలోని రాజులకండ్రిగ ఎంపీపీ పాఠశాలలో గురువారం వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కిషోర్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు ఓపీలు అందించి బీపీ, షుగర్, ఈసీజీ వైద్య పరీక్షలు చేసి, వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ ఝాన్సీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు





వెంకటేశ్వర్లు, ముని చంద్రశేఖర్

నాగలాపురం: సత్యవేడు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో గురువారం అడ్వకేట్ బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారి వేలు ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ చేపట్టారు. ఈ ఎన్నికల్లో సత్యవేడు న్యాయవాది డి.వెంకటేశ్వర్లు ప్రెసిడెంట్‌గా, పిచ్చాటూరు మండలం, గోవర్ధనగిరి గ్రామానికి చెందిన న్యాయవాది వి.మునిచంద్రశేఖర్‌ను ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వీరిని పలువురు న్యాయవాదులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పీడీ వెంకటేశ్వరులు, ఎస్.చంద్రశేఖర్, మునిశేఖర్, వేలు జానయ్య, రాజ, మహేష్, అఖిల, న్యాయవాదులు పాల్గొన్నారు.

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గురుదక్షిణామూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.



రోడ్డుపై నిలిచిన మురుగునీరు



అధ్వాన్నంగా ఉన్న కాలనీ ప్రధాన రహదారి

మర్రిమందలో సమస్యల తిష్ట

- అధ్వానంగా ప్రధాన రహదారి
- ఖాళీ స్థలాలు, రోడ్లపై నిలిచిన మురుగునీరు
- తాగునీటికి ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



కాలనీలో నిలిచిన మురుగునీరు

ఏర్పేడు: మండలంలోని మర్రిమంద కాలనీ వాసులు సమస్యలతో సతమతమవుతున్నారు. మర్రిమంద, పాపానాయుడుపేట, వికృతమాల గ్రామాలకు చెందిన 1,200 మంది పేదలకు గత ప్రభుత్వం ఇళ్ల స్థలాలను మంజూరు చేసింది. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో అప్పు చేసి నూతన గృహాలు నిర్మించుకున్నారు. ప్రస్తుతం 70 శాతం మంది కాలనీలో కాపురాలు ఉంటున్నారు. కాలనీలో సమస్యలు తాండవిస్తున్నాయని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ చేసి వసతులు కల్పించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

రోడ్డు ఏర్పాటు చేయండి



కాలనీలోని ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. కాలనీవాసులు రోడ్డుపై వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే రోడ్డు చెరువును తలపిస్తోంది. అధికారులు రోడ్డు ఏర్పాటు చేయాలి - నాగమ్మ, మర్రిమంద కాలనీ, ఏర్పేడు మండలం.

అద్దె భవనంలో ఉంటున్నాం



అప్పు చేసి మర్రిమంద కాలనీలో నూతన గృహాన్ని నిర్మించుకున్నాం. కాలనీలో వసతులు సక్రమంగా లేనందున పాపానాయుడుపేటలో అద్దె భవనంలో నివసిస్తున్నాం. అధికారులు వసతులు కల్పిస్తే అద్దె భవనం నుంచి మర్రిమంద కాలనీలో కాపురం ఉంటాం. - గణపతి, పాపానాయుడుపేట, ఏర్పేడు మండలం.

సమస్యలను పరిష్కరిస్తాం



తక్షణమే పంచాయతీ కార్యదర్శిని కాలనీకి పంపి సమస్యలను గుర్తించేలా చర్యలు తీసుకుంటాం. మర్రిమంద కాలనీలో ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం. - గిడ్డయ్య, ఎంపీడీఓ, ఏర్పేడు మండలం.

సమస్యలు పరిష్కరించండి



మర్రిమంద కాలనీలో సమస్యలతో సతమతమవుతున్నాం. ప్రస్తుతం రోడ్లు, ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలిచిపోయింది. మురుగునీటిలోనే వెళుతున్నాం. దోమలు చేరి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. తాగునీటి పైపులు మరమ్మతులకు గురై కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా ఆగిపోయింది. తాగునీటి సమస్యను పరిష్కరించాలి. -లత, మర్రిమంద కాలనీ, ఏర్పేడు మండలం.

కాలనీలో సమస్యలు

- కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా ఉండడంతో రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిళ్లు ప్రమాదాలు జరిగితే సకాలంలో ఆస్పత్రికి వెళ్లలేరు.
- వర్షం పడితే రోడ్లు, ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తుండడంతో వ్యాధులు సంభవించే ప్రమాదం ఉంది.
- సక్రమంగా రోడ్లు, మురుగునీటి కాల్వలు లేక కాలనీవాసులు ఇబ్బందులుపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.
- సక్రమంగా వీధిలైట్లు లేనందున రాత్రిళ్లు కాలనీలో పాములు, తేళ్లు సంచరిస్తుండడంతో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి.
- కాలనీలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ మోటారు పైపులు మరమ్మతులకు గురై కొళాయిల ద్వారా నీళ్లురాకపోవడంతో తాగునీటి సమస్యతో కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

నీటి వృథాను అరికట్టండి



కొళాయి నుంచి వృథాగా పోతున్న నీరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వీఎస్ పురం గ్రామపంచాయతీ పరిధిలోని వేణుగోపాలపురం గ్రామంలోని తాగునీటి కొళాయిలు మరమ్మతులకు గురికావడంతో నీరు వృథాగా పోతుంది. తాగునీటి కొళాయిల ట్యాప్‌లు పనిచేయకపోవడంతో నీరంతా ఏరులై పారుతోంది. దీంతో నీరుచాలక గ్రామస్తులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వ్యవసాయ బోర్లు, బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది. తాగునీటి కొళాయిలకు మరమ్మతులు చేపట్టాలని గ్రామకార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి కొళాయిలకు ట్యాప్‌లను బిగించి, నీటి వృథా అరికట్టాలని కోరుతున్నారు.

వైభవంగా ఎల్లమ్మ కుంభాభిషేకం



విశేషాలంకరణలో ఎల్లమ్మ

ఏర్పేడు: మండలంలోని బాలకృష్ణాపురంలో గురువారం ఎల్లమ్మ కుంభాభిషేకం వైభవంగా జరిగింది. గ్రామస్తులు నూతనంగా అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయంలో మూడు రోజుల పాటు కలశ స్థాపన, వివిధ రకాల హోమాలు, అంకమ్మ, గంగమ్మ, ఎల్లమ్మ ముగ్గులతో విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం కుంభాభిషేకం పూజల్లో భాగంగా అమ్మవారి శిలను ప్రతిష్ఠించి విశేషాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన



మాట్లాడుతున్నన్న డాక్టర్ దివ్య

రాపూరు: మండలంలోని వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఫ్లోరోసిస్ వ్యాధిపై జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ దివ్య వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఫ్లోరోసిస్ వల్ల అంగవైకల్యం వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పంటికి అధికంగా గార పడుతుందని పేర్కొన్నారు. ఈ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు రాజకుమారి, సూర్యధర్మేంద్ర, అనిత, ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దివాకర్

బుచ్చినాయుడుకండ్రిగ: అక్షర ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గురువారం వైద్యాధికారి దివాకర్, సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేతులను శుభ్రం చేసుకుని భోజనం చేయాలని, వేడిగా ఉన్న ఆహారాన్ని తినాలని తెలిపారు. వర్షాకాలంలో కలుషిత నీరు తాగడం, కలుషిత ఆహార పదార్థాలను తీసుకోవడంతో టైఫాయిడ్, డయేరియా వస్తాయని తెలిపారు. దోమల ద్వారా మలేరియా, వైరల్ ఫీవర్లు, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చుననతి తెలిపారు. అనంతరం కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు.

శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ బదిలీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న రమేష్‌బాబు బదిలీ అయ్యారు. రాష్ట్ర పురపాలకశాఖ అడ్మినిస్ట్రేషన్ చేసిన సాధారణ బదిలీల్లో భాగంగా రమేష్‌బాబును పొన్నూరు కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

ఆర్టీసీ డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్ష

సత్యవేడు: మండలంలోని మదనంబేడు వద్ద 2019లో జరిగిన రోడ్డు ప్రమాదంలో పి. పురంధర్(4) అనే బాలుడు మృతిచెందిన కేసులో ఆర్టీసీ డ్రైవర్ నాగేంద్రబాబుకు ఏడాది జైలు, రూ.2వేలు జరిమానా విధించారని ఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపారు. గురువారం సత్యవేడు కోర్టు జడ్జి గోపాలకృష్ణ కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు కథనం.. తిరుపతికి చెందిన సుకుమార్(34), గురుస్వామి(36) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా సీతారాంపేట వద్ద ముందు వెళుతున్న కారును అధిగమించబోయి అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

అంగన్‌వాడీకి నూతన భవనం





నూతన అంగన్‌వాడీ భవనం, అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఎండీ

శ్రీసిటీ(సత్యవేడు): శ్రీసిటీలోని ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ పరిశ్రమ వితరణతో గొల్లవారిపాళెం అంగన్‌వాడీ కేంద్రానికి నూతన భవనం నిర్మించారు. గురువారం ఆ పరిశ్రమ ఎండీ హాజీమే కజోకా ప్రారంభించారు. తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కార్యక్రమం ద్వారా రూ.35 లక్షల ఖర్చుతో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించామని ఎండీ హాజీ యే కజోకా తెలిపారు. భవనంతోపాటు మరుగుదొడ్లు, ప్రహరీ, ఫర్నిచర్, టీవీ, ఆట వస్తువులను ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన భూమిని శ్రీసిటీ విరాళంగా ఇచ్చిందన్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ విద్య, వైద్య సంస్థల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి తమ కంపెనీ చొరవ చూపుతుందన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రసన్నారెడ్డి తన సందేశంలో ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ సంస్థ తన సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా సత్యవేడులో అభివృద్ధి పనులు చేపడుతోందని తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు రూ.26 లక్షల విలువైన అంబులెన్సు ఏర్పాటు, రూ.8.5 లక్షలతో తడ జెడ్పీ హైస్కూల్‌లో టాయిలెట్ బ్లాక్‌ల నిర్మాణం చేపట్టిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు సంజయ్ ఆనంద్, మల్లేశ్వరన్ సాయికృష్ణ, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్(కస్టమర్ రిలేషన్స్) సి.రమేష్‌కుమార్, సెక్యూరిటీ ప్రతినిధి వై.రమేష్, శ్రీసిటీ సీనియర్ మేనేజర్ సురేంద్రకుమార్, గ్రామ సర్పంచ్ పార్వతి, సన్యాసయ్య, అంగన్‌వాడీ కార్యకర్త కె.సుధారాణి, అధికారులు పాల్గొన్నారు.

నేడు నాగలాపురంలో గ్రామసభలు

నాగలాపురం: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గుర్తింపునకు ప్రతి పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పీఎంకే బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులను ఎంపిక చేసి, గ్రామసభల్లో పంచాయతీ తీర్మానం చేస్తామన్నారు. తమ గ్రామ అభివృద్ధికి అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులతోపాటు ఇతర మౌలిక వసతుల కల్పనకు సభలో ప్రతిపాదించి తీర్మానం చేయవచ్చునని ఎంపీడీఓ పేర్కొన్నారు.

విజయవంతం చేయండి

ఏర్పేడు: మండలంలోని గ్రామాలన్నింటిలో శుక్రవారం జరిగే గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు శుక్రవారం ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై ప్రజలకు అవగాహన, నూతన ఇసుక విధానం ప్రారంభ అమలు, విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు అంశాలపై గ్రామసభల్లో అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామసభలకు ప్రజా ప్రతినిధులు, ప్రజలు, ఉపాధి హామీ కూలీలు, అధికారులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

హాస్టల్‌ను పరిశుభ్రంగా ఉంచాలి



మరుగుదొడ్లు పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంఈఓ,



హాస్టల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఎస్సీ బాలుర హాస్టల్ పరిసరాలను, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచుకోవాలని తహసీల్దార్ సుబ్రమణ్యం వార్డెన్ సాల్మన్‌రాజ్‌ను ఆదేశించారు. గురువారం స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆయన ఎంఈఓ రవీంద్రనాథ్‌తో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, మరుగుదొడ్లు శుభ్రంగా లేకపోవడంపై వార్డెన్ సాల్మన్‌రాజ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాచ్‌మన్, సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని వార్డెన్ తెలిపారు. శుభ్రత విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయవద్దని, వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాలం కావడంతో గదుల్లోకి దోమల రాకుండా చూడాలని, అలాగే రోజువారీ అందుతున్న మెనూ గురించి అడిగి తెలుసుకున్నారు. బాత్‌రూమ్‌లను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. పాత భవనం కావడంతో మరమ్మతులకు గురైఉందని, మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

నాగలాపురం: విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఎంపీడీఓ పీఎంకే బాబు అన్నారు. గురువారం మండలంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీఓ పీఎంకే బాబు, తహసీల్దార్ హనుమాన్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్టల్‌లోని వంట గదులు, స్నానాల గది, విద్యార్థులు నిద్రించే గది, నీటి తొట్టి, మరుగుదొడ్లు, పరిసర ప్రాంతాల పరిశుభ్రతను తనిఖీ చేశారు. హాస్టల్ పరిసర ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు తొలగించాలని, డ్రైనేజీ వద్ద నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రతి రోజూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ బాబయ్య, జనార్దనరాజు, పంచాయతీ కార్యదర్శి నాగరత్నమ్మ, రెవెన్యూ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



సీఐ శ్రీనివాసులు

వరదయ్యపాళెం: శ్రీసిటీ పారిశ్రామికవాడలోని హైటెక్ పోలీస్‌స్టేషన్ సీఐగా బీవీ శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి పోలీస్ కమాండ్ విభాగంలో సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆయనను శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. అలాగే ఇక్కడ పనిచేస్తున్న సీఐ భాస్కర్‌ను నగరికి బదిలీ అయ్యారు. శ్రీనివాసులు మాట్లాడుతూ పారిశ్రామిక నగరంగా అభివృద్ధి చెందుతున్న శ్రీసిటీలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు.



ఎస్‌ఐ మల్లికార్జున

వరదయ్యపాళెం ఎస్‌ఐగా మల్లికార్జున: వరదయ్యపాళెం మండల ఎస్‌ఐగా కేఆర్ మల్లికార్జున గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. కడప తాలూకా పోలీస్ స్టేషన్ నుంచి వరదయ్యపాళెం పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ ప్రతాప్ 20రోజుల క్రితం వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఎస్‌ఐ మల్లికార్జున మాట్లాడుతూ శాంతి భద్రతలకు ప్రాధాన్యతనిచ్చి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యతనిచ్చి పరిష్కారిస్తామని పేర్కొన్నారు.

చేతివృత్తులతో ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు కోర్సు మెటీరియల్స్‌ను అందజేస్తున్న నాగరాజు

తిరుపతి కల్చరల్: చేతివృత్తుల ద్వారా ప్రతి మహిళ స్వయం కృషితో ఆర్థికాభివృద్ధి సాధించి కుటుంబానికి బాసటగా నిలవాలని రాస్ మహిళా పొదుపు సంఘాల సంచాలకుడు వి.నాగరాజు పిలుపునిచ్చారు. రాస్–జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో జీవకోనలో ఏర్పాటు చేసిన మహిళలకు మూడునెలల ఆర్యవర్క్ శిక్షణను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నేటి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కుటుంబంలో ప్రతి ఒక్కరూ పని చేస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా జన్ శిక్షణ సంస్థ నిర్వహించే వివిధ రకాల చేతివృత్తులపై శిక్షణ తీసుకోవాలని కోరారు. తర్వాత జన్ శిక్షణ సంస్థాన్ ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాస్ కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఆర్య వర్క్ కోర్సుకు సంబంధించిన మెటీరియల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో రాస్ ప్రతినిధులు నాగేశ్వరరావు, శ్రీదేవి, రేవతి, మాధవి, 50 మంది మహిళలు పాల్గొన్నారు.

కలుపు మొక్కల నివారణపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న ఏడీఆర్ డాక్టర్ సుమతి, విద్యార్థులు

తిరుపతి సిటీ: స్థానిక ఆర్ఏఆర్ఎస్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో పార్థినీయం కలుపు మొక్కల నివారణోత్సవాలలో భాగంగా గురువారం విద్యార్థులు, సిబ్బంది కలుపు మొక్కల నివారణపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి మాట్లాడుతూ వ్యవసాయదారులు తమ పొలాల్లో పార్థీనీయం కలుపు మొక్కలను నివారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కలుపు మొక్క పంటకు పెద్దఎత్తున నష్టం కలిగిస్తుందన్నారు. పంటలలో సుమారు 40 శాతం, పశుగ్రాసంలో 90 శాతం దిగుబడిని తగ్గించే శక్తి ఈ కలుపు మొక్కకు ఉందన్నారు. క్యారెట్ గడ్డి, నక్షత్రగడ్డి, ముక్కపుల్ల మొక్క వంటి పేర్లతో ఈ కలుపు మొక్కను పిలుస్తారని తెలిపారు. ర్యాలీలో శాస్త్రవేత్తలు సుధాకర్, ప్రసాద్, లతా, విశ్వనాథ్, సిబ్బంది మదన్‌మోహన్, హారతి, పెద్దసంఖ్యలో వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటన హేయం



కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన హత్యోదంతం హేయమని, భారత సమాజం సిగ్గుతో తలదించుకోవాల్సిన దౌర్భాగ్యం దాపురించిందని రేణిగుంట ఎంపీటీసీ రాజేశ్వరి అన్నారు. రేణిగుంట బాలికోన్నత పాఠశాల విద్యార్థినులతో కలసి గురువారం ఐద్వా ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన ర్యాలీ చేశారు. ఈ ఘటన భారత సమాజానికి సిగ్గుచేటన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. నిందితుల పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. హెచ్‌ఎం విష్ణువర్ధనం, ఐద్వా నాయకురాలు సత్యశ్రీ, లక్ష్మి, ప్రగతి సంస్థ ప్రతినిధులు రాజేశ్వరి, సుమలత పాల్గొన్నారు. - రేణిగుంట